కల్వర్టు పనులు పూర్తయ్యేనా !

- భారీ వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టు
- పనులను నిలిపేసిన కాంట్రాక్టర్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



నాంపల్లి: నియోజకవర్గంలోని మల్లేపల్లి నోబుల్ టాకీస్ చౌరస్తా నుంచి రవీంద్రభారతి పాఠశాల వైపు వెళ్లే రోడ్డుపై మురికినీటి నాలా కల్వర్టు పనులు అర్థాంతరంగా నిలిచి పోయాయి. గతేడాది కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు పూర్తిగా దెబ్బతిన్నది. కల్వర్టు దెబ్బ తిని ఆరు నెలలు కావస్తున్నా.. నేటికి పూర్తి కాలేదు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ సకాలంలో పూర్తి చేయకుండా అర్థాంతరంగా వదిలేశాడు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. దీనిపై జీహెచ్ఎం సీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

గతేడాది ప్రారంభించిన పనులు..

గత ఏడాది అక్టోబర్‌లో మురికినీటి నాలా పనులను ఆగమేఘాల మీద ప్రారంభించారు. కాంట్రాక్ట్ పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ కల్వర్టుతో పాటు ఇందిరానగర్, ఫిరోజ్‌గాం ధీనగర్ ప్రియా టాకీస్ సరిహద్దు, సీతల్ హోటల్ ఎదురుగా ప్రవహిస్తున్న మురికినీటి ఓపెన్ నాలా మీద పైకప్పు పూర్తి చేయాల్సి ఉంది. కానీ నాలా పైకప్పు పనులు పూర్తి చేసి రోడ్డు కల్వర్టు పనులు పూర్తి చేయకుండా వది లేశారు. రోడ్డుకు ఇరువైపులా మట్టిని కూడా కొంత మేర తవ్వి పూర్తిచేయకుండా వదిలే యడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రద్దీగా రహదారి..

ఈ రహదారి ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీగా ఉంటుంది. ఇక్కడే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు అధికంగా ఉన్నాయి. ఈ రహదా రిలో అధిక రద్దీ ఉండటం చేత ట్రాఫిక్‌కు అం తరాయం కలుగుతోంది. ఈ మురికి నీటి నాలా హుమయున్‌నగర్, దేవునికుంట, ఇం దిరానగర్, ఫిరోజ్‌గాంధీనగర్, ప్రియాటాకీస్ మీదుగా అఫ్జల్‌సాగర్ నాలా గుండా ప్రవ హించి చివరకు అఫ్జల్‌గంజ్ వద్ద మూసిన దిలో కలుస్తుంది. నాలా పనులు నిలిచిపోయి స్థానికులు ఇబ్బందులు పడుతున్న అటు ప్రజాప్రతినిధులు, ఇటు మున్సిపల్ అధి కారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి శీతల్ హోటల్ వద్ద నిలిచిపోయిన కల్వర్టు పనులను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రెండు వారాల్లో పూర్తిచేస్తాం..

బస్తీలో మురుగు నాలా పనులు జరుగుతున్నాయి. నాలా పనులు ఆలస్యం కావడంతో కల్వర్టు పనులు జరగడం లేదు. మరో రెండు వారాల్లో పనులను పూర్తి చేస్తాం.

– ఈఈ లాల్‌సింగ్, మెహిదీపట్నం సర్కిల్–12

పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి


మాట్లాడుతున్న డాక్టర్ నాగేందర్

అఫ్జల్‌గంజ్: నర్సులు పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించి ఉస్మానియా ఆస్పత్రికి మంచిపేరు తీసుకురావాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి నాగేందర్ అన్నారు. ఇటీవలే నర్సింగ్ ఉద్యోగాలు పొందిన స్టాఫ్ నర్సులకు మూడ్రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణితో కలిసి బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని నర్సులు ఓర్పు, సహనంతో పేద రోగులకు వైద్య సేవల్లో భాగస్వాములు కావాలని సూచించారు.

గోల్కొండ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



గోల్కొండ: గోల్కొండ ఇన్‌స్పెక్టర్‌గా పని చేయడం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. ఇక్కడి ప్రజలు శాంతికాముకులని, ఆయన బదిలీ అయిన సందర్భంగా బుధవారం తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ ఆయనను సన్మానించారు. గోల్కొండకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని ఇక్కడ హిందూ, ముస్లింల స్నేహ సంబంధాలు ఇతర ప్రాంతాల వారికి ఆదర్శమన్నారు. పండుగలు, జాతరలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులకు సహకరిస్తారన్నారు. ఖాలేద్ అలీఖాన్ తదితరులున్నారు.

విద్యార్థులను జంతు ప్రేమికులుగా మార్చాలి



గోల్కొండ: విద్యార్థులను జంతు ప్రేమికులుగా మార్చాలని వీనస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ మహ్మద్ హిదాయత్ అలీఖాన్ అన్నారు. బుధవారం ఆయన విద్యార్థులతో విజ్ఞాన విహార యాత్రకు వెళ్లారు. గండిపేట్‌లోని గుర్రాల శాలలో ఆయన పిల్లలతో కలిసి గుర్రాలను వీక్షించారు. ఈ సందర్భంగా పిల్లలు గుర్రాల శాలలో ఉన్న గుర్రాలను తాకుతూ.. సంబరపడ్డారు. పెళ్లిలు, శుభకార్యాల్లో గుర్రాలను వాడతారని, పోలీసు విభాగంలో అశ్విక దళం ఉంటుందని దీనిపై పోలీసులు స్వారీ చేస్తూ.. శాంతిభద్రతలను కాపాడుతారన్నారు. రామాయణ, మహాభారతంలో సైతం గుర్రాల పాత్ర కీలకమని వివరించారు.

కార్మికులకు న్యాయం చేయాలి

గన్‌ఫౌండ్రీ: కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్‌స్టేషన్‌లో ఉద్వాసనకు గురైన కార్మికులకు న్యాయం చేయాలని విద్యుత్ శాఖ కార్మికులు నిరసనకు దిగారు. ఈ మేరకు బుధవారం నాంపల్లి చంద్రవిహార్‌లోని లేబర్‌కోర్టు ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ఉద్వాసనకు గురైన కార్మికులకు న్యాయం జరగాలని ఈ విషయాన్ని కొత్త జడ్జిచేత పునఃపరిశీలించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. 2006 నుంచి వివిధ కారణాలతో ఈ విషయాన్ని పెండింగ్‌లోనే పెడుతున్నారని తమకు తగిన న్యాయం చేయకపోతే రాష్ట్ర హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. కార్మిక నాయకులు ఎంఏ.వజీర్, చంద్రశేఖర్, ఎం.జగదీష్, కె.రత్నారావు, రామ్మోహన్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా


ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు

అబిడ్స్: కాంగ్రెస్ పార్టీ ప్రజలను పలు విధాలుగా మోసం చేస్తుందని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు ఆశీష్‌కుమార్ యాదవ్ ఆరోపించారు. ట్యాంక్‌బండ్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద జరిగిన బీఆర్ఎస్ ధర్నాలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దగా చేస్తుందని అన్ని అబద్ధాలే చెబుతూ.. కాలం గడుపుతోందని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మొఘల్‌పురా అదనపు ఇన్‌స్పెక్టర్‌గా శ్రీను

గౌలిపురా: మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ అదనపు ఇన్‌స్పెక్టర్‌గా సి.శ్రీను బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన పండరీ బదిలీ కావడంతో ఆయన స్థానంలో శ్రీనును నియమిస్తూ.. నగర పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన ఛత్రినాక, బేగంబజార్, మహంకాళి తదితర పోలీస్‌స్టేషన్లలో పనిచేసి మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్‌కు అదనపు ఇన్‌స్పెక్టర్‌గా వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు పోలీసుల నిఘా ఉంటుందన్నారు. ప్రశాంత వాతావరణంలో పండుగలు జరిగేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు ప్రజలు సహకరించాలన్నారు.

దయానంద సరస్వతి సేవలు చిరస్మరణీయం

సుల్తాన్‌బజార్: మానవ జీవిత లక్ష్యం మోక్షాన్ని చేరుకోవాలని బోధించిన గొప్ప మానవతవాది మహర్షి దయానంద సరస్వతి అని హెచ్‌సీయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బీజే.రావ్ అన్నారు. మహర్షి దయానంద సరస్వతి జయంతి సందర్భంగా సుల్తాన్‌బజార్‌లోని ఆర్యసభ సమాజ్‌లో ఆయన జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ.... మహర్షి దయానందుడు మనం మరిచిపోయిన సత్య సనాతన వేదిక ధర్మాన్ని పునరుద్ధరించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. నేటి అన్ని రకాల సమస్యల పరిష్కారానికి స్వామి దయానందుని బోధనలు ఆచరణీయమన్నారు. ఉమ్మడి రాష్ట్ర ఆర్యసమాజ్ ప్రతినిధి డాక్టర్ ధర్మతేజ, నళిని ఆచార్య, మాజీ కార్పొరేటర్ రాంచందర్‌రాజు, ఆచార్య సవిత, ధర్మవతి, డాక్టర్ మైత్రేయి, ధర్మేంద్ర, ప్రదీప్‌జాజు, యష్‌పాల్, అభిషేక్, అరవింద్, సంతోష్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి

దూద్‌బౌలి: కాంగ్రెస్–మజ్లిస్ పార్టీ ఒప్పందం అంటూ.. మంత్రి పొన్నం ప్రభాకర్ పైన జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని లేదంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ బహదూర్‌పురా ఇన్‌చార్జి పులిపాటి రాజేష్‌కుమార్ హెచ్చరించారు. ఉప్పుగూడలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఈనెల 5న అంగన్‌వాడి ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ సైతం హాజరై.. మంత్రితో మాట్లాడుతూ.. తమ ఒవైసీ ఎడ్యుకేషన్ సెంటర్‌కు తీసుకెళ్లారన్నారు. అంత మాత్రానా మజ్లిస్ పార్టీతో కాంగ్రెస్ పార్టీ ఒప్పందం కుదుర్చుకుందని తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మహిళలు ఆర్థికంగా ఎదిగి తమ కుటుంబాలకు శక్తిగా మారినప్పుడే వారికి మంచి గుర్తింపు ఉంటుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. బుధవారం నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్‌లో గ్రేటర్ బల్దియా ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఏటా తమ హక్కుల కోసం గొంతెత్తుతున్న మహిళల సంఖ్య పెరుగుతుందన్నారు. మహిళల్లో వస్తున్న ఈ మార్పు ఒక శుభపరిణామన్నారు. గత దశాబ్దాలుగా కార్వాన్ నియోజకవర్గంలో మహిళల్లో వస్తున్న మార్పును తాను గమనిస్తున్నానన్నారు. తల్లులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు ఎంతో ఇష్టపడుతున్నారన్నారు. తమ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు వారు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. నేడు అన్ని రంగాల్లో మహిళలే ముందుండి మార్పునకు, ప్రగతికి ఉత్సాహం చూపుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురు మహిళలకు బల్దియా డిప్యూటీ కమిషనర్ శశిరేఖతో కలిసి బహుమతులను అందజేశారు. బల్దియా టౌన్‌ప్లానింగ్ ఏసీపీ విజయశ్రీ, లలితకుమారి తదితరులున్నారు.

పాతబస్తీలో మెట్రో శంకుస్థాపనకు ఏర్పాట్లు

- బందోబస్తును పరిశీలించిన దక్షిణ మండలం డీసీపీ


సభాస్థలి ఆవరణలో బందోబస్తును పరిశీలిస్తున్న డీసీపీ సాయిచైతన్య

చాంద్రాయణగుట్ట: పాతబస్తీలో మెట్రో రైలు నిర్మాణానికి సంబంధించి ఫలక్‌నుమా ఫారూఖ్‌నగర్ డిపో ఆవరణలో ఈనెల 8న సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. ఫారూఖ్‌నగర్ బస్సు టెర్మినల్ ఆవరణలో వేదికను ఏర్పాటు చేస్తుండగా.. ప్రధాన రహదారిని ఆనుకుని శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. వేదిక పరిసరాల్లో బందోబస్తు విషయమై దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, అదనపు డీసీపీ షేక్ జహంగీర్, ఫలక్‌నుమా ఏసీపీ బి.వై. స్వామి, ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డిలు బుధవారం సాయంత్రం పర్యవేక్షించారు. వాహనాల పార్కింగ్, వీఐపీల రూట్ తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యుత్ ఇబ్బందులు తలెత్తకుండా ఫలక్‌నుమా ఏడీఏ రాజు ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి వచ్చే రూట్‌లో అడ్డంకులు లేకుండా జీహెచ్ఎంసీ అధికారులు కూడా పనులను వేగవంతం చేయడంతో పాటు పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ ఫుట్‌పాత్‌లకు రంగులద్దుతున్నారు.

కాంగ్రెస్ నేతల హర్షం..
పాతబస్తీలో మెట్రో రైలు నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతుండటంతో పాతబస్తీలోని కాంగ్రెస్ నాయకుల్లో కొత్త జోష్ నెలకొంది. పదేళ్ల అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే పాతబస్తీ ప్రజల చిరకాల ఆకాంక్షగా ఉన్న మెట్రో రైలు రాబోతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 8న ఫలక్‌నుమాలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగనున్న నేపథ్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు సభాస్థలి పరిసరాలను పరిశీలిస్తూ.. సందడి చేశారు. పార్టీ నాయకులు కె.వెంకటేష్, మహ్మద్ మూసా కాసీం, మనోజ్, అనిల్, శ్యామ్‌రావు ముదిరాజ్, ఫెరోజ్, ఘనీ, జాహెద్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన కార్యక్రమంపై సమీక్ష..
గాంధీభవన్‌లో పాతబస్తీ నాయకులతో సమీక్ష కార్యక్రమం కొనసాగిందని పార్టీ ఎస్టీసెల్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ కె.గణేష్ రాథోడ్ తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్‌యాదవ్‌ల సమక్షంలో జరిగిన ఈ సమీక్షలో చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా ఇన్‌చార్జిలు బోయ నగేష్, రాజేష్, స్థానిక నాయకులు ప్రమోద్‌రెడ్డి, రోహిన్‌రెడ్డి పాల్గొన్నారన్నారు.

జీవశాస్త్ర పరిశోధనలతో సమాజ వికాసం


ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ ఎస్‌కె.మహ్మద్

గన్‌ఫౌండ్రీ: జీవశాస్త్ర రంగంలో నూతన ఆవిష్కరణలు రావడం వల్ల విద్య, ఉపాధితో పాటు సమాజ వికాసానికి ఎంతో అవకాశం ఉందని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్‌కె.మహ్మద్ అన్నారు. బుధవారం నిజాం కళాశాలలో మైక్రో బయోలజీ శాఖ ఆధ్వర్యంలో ఇన్నొవేషన్స్ ఇన్ మైక్రో బీఎల్ బయోటెక్నాలజీ అనే అంశంపై రెండ్రోజుల జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రపంచ పోటీని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులతో పాటు అధ్యాపకులు కూడా నూతన విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. జీవశాస్త్ర రంగంలో హైదరాబాద్ హబ్‌గా మారిందన్నారు. భవిష్యత్తులో రోబోటిక్, బయోఫార్మా, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ మొదలైన వాటికి భవిష్యత్తు ఉందని ఆయా రంగాలపై విద్యాసంస్థలు దృష్టి సారించాలన్నారు. నిజాం కళాశాల ప్రిన్సిపాల్ భీమా, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ చాంద్‌పాషా, ప్రొఫెసర్ బుర్రి రంగారెడ్డి, ప్రొఫెసర్ ఎల్.వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా సామాజిక సమ్మేళనం

చార్మినార్: రాష్ట్ర వ్యాప్తంగా ఓబీసీ మోర్చాను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర ఓబీసీ ఐటీ సెల్ కన్వీనర్ ప్యారసాని వెంకటేష్ అన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని దేవీబాగ్ వద్ద నాయకులు గౌరీశంకర్ సోనీ ఆధ్వర్యంలో ఓబీసీ మోర్చా సామాజిక సమ్మేళనం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. ఓబీసీ మోర్చాను పార్లమెంట్ ఎన్నికల వరకు మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మోర్చా జిల్లా అధ్యక్షులు ఉదయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ రావు, ఉపాధ్యక్షులు కరణ్ పాల్గొన్నారు.

పురస్కారాల ప్రదానం


పురస్కారం అందజేస్తున్న జస్టిస్ రామలింగేశ్వర్‌రావు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువ కళావాహిణి ఆధ్వర్యంలో బుధవారం రవీంద్రభారతిలో అక్కినేని లలిత కళా పురస్కారాలను ప్రదానం చేశారు. ఇటీవల పద్మశ్రీ పురస్కారం వచ్చిన ఉమామహేశ్వరీ, డాక్టరేట్ పొందిన కళాకృష్ణ దంపతులకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎ.రామలింగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. దంపతులిద్దరు లలితకళల వ్యాప్తి కోసం పాటుపడటం అభినందనీయమన్నారు. డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, రచయిత్రి కెవి.కృష్ణకుమారి, యువకళావాహిణి అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభావాన్ని అలవర్చుకోవాలి

గన్‌ఫౌండ్రీ: ప్రతి ఒక్కరూ శాంతిభావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో గ్లోబల్ హ్యూమన్‌రైట్స్ ట్రస్ట్ ఇండియా ఆధ్వర్యంలో అంతర్జాతీయ శాంతి సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ట్రస్టు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.శ్రీనివాస్, మోటివేషనల్ స్పీకర్ సైదా సీమా ఫాతీమా తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య బాలరాముని చిత్రపటం బహూకరణ

చార్మినార్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి, విరించి ఆస్పత్రి చైర్‌పర్సన్ మాధవి లతతో పాటు తాను ఆర్ఎస్ఎస్ జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఇంద్రేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు. ఈ సందర్భంగా అయోధ్య రామమందిరంలో కొలువుదీరిన బాలరాముని చిత్రపటాన్ని మాధవిలతకు అందజేసి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధించాలని ఆయన శుభాకాంక్షలు తెలియజేసినట్లు ఫిరాసత్ అలీ బాక్రీ చెప్పారు.

నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్టులను విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

గౌలిపురా: నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్టులను తయారు చేస్తున్న వ్యక్తిని భవానీనగర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 155 కేజీల అల్లం, వెల్లుల్లి పేస్టు, సింథటికల్ కెమికల్ కలర్స్, 1.5 లూబ్రికెంట్ ఆయిల్ బాక్స్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఎం.రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మీర్ జుమ్లా ఎం.జె. ట్యాంక్ ప్రాంతానికి చెందిన మహ్మద్ మస్తాన్ (48) తన ఇంట్లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఆరోగ్యానికి హాని కలిగించే నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్టులను తయారు చేస్తున్నాడు. అనంతరం పలు హోటళ్లు, కిరణాషాపులకు విక్రయిస్తున్నాడు. విశ్వసనీయమైన సమాచారం మేరకు భవానీనగర్ పోలీసులు ఫుడ్ సెఫ్టీ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. పోలీసులు జరిపిన దాడుల్లో 155 కేజీలు, సింథటికల్ కెమికల్ కలర్లు, 1.5 లూబ్రికెంట్ ఆయిల్ బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు

- కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్



గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేయిస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. లంగర్‌హౌజ్, టోలిచౌకీ, నానల్‌నగర్ డివిజన్‌లకు చెందిన పలువురు బుధవారం టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా తమతమ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు పూర్తైన సందర్భంగా ఎమ్మెల్యేను పూల మాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనులకు నిధులు సాధించడమే కాకుండా ఆ పనులను తాను స్వయంగా పర్యవేక్షిస్తుంటానన్నారు. దీంతో సంబంధిత అధికారులు ఆ పనులను పర్యవేక్షిస్తారని పనుల్లో జాప్యం జరగకుండా ఉంటుందన్నారు. వర్షాకాలం కంటే ముందే నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ పనులు పూర్తవుతాయన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో ప్రస్తుతం జరుగుతున్న వరద నీటి పైపులైన్ పనులు చివరి దశలో ఉన్నాయని, వచ్చే ఏప్రిల్ నెలాఖరుకు ఈ పనులు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకుడు అబీబ్ చౌష్, బేగ్ తదితరులున్నారు.

పాదయాత్రతో ప్రజా సమస్యల పరిష్కారం


బస్తీలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే జఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బస్తీలలో పాదయాత్రలు నిర్వహిస్తూ.. ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని యాకుత్‌పురా ఎమ్మెల్యే జఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. బుధవారం ఆయన రెయిన్‌బజార్ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి డివిజన్ పరిధిలోని ఇమ్లీబన్, ముర్తుజానగర్, అలీనగర్, ఖురేషీలైన్, మౌల్లాకా చిల్లా ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ.. తమ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకుఅన్ని ప్రాంతాల్లో పాదయాత్రలు నిర్వహిస్తూ.. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అభివృద్ధి పనులను పరిశీలించి పురోగతిపై అధికారులతో చర్చించామని తెలిపారు. మజ్లిస్ నాయకులు మహ్మద్ వసీముద్దీన్, మహ్మద్ కరీం, పలు విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో దోమల నివారణకు చర్యలు


ఆస్పత్రిలో దోమల మందు పిచికారి చేస్తున్న దృశ్యం

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో ఇన్‌పేషంట్లకు దోమల బెడద లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరెంటిండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా అన్నారు. బుధవారం ఆయన ఆసుపత్రిలో జరుగుతున్న దోమలమందు స్ప్రేయింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం తమ ఆస్పత్రి ఇన్‌పేషంట్ విభాగం వందశాతం ఆక్యూపెన్సీతో ఉంటుందన్నారు. ఆస్పత్రిలో పేషంట్లకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నామన్నారు. దోమలు వృద్ధి చెందకుండా వారానికి రెండు సారు బల్దియా ఎంటమాలజీ విభాగం సిబ్బందితో దోమల మందు స్ప్రే చేయిస్తున్నామన్నారు. ఐసీయూ విభాగంతో పాటు ఆస్పత్రి భవనంలోని మొదటి అంతస్తులో ఉన్న వాటర్ ప్లాంట్, డస్ట్‌బిన్ ఏరియాలలో దోమలు వృద్ధి చేయకుండా స్ప్రేయింగ్ చేయించామన్నారు. బల్దియా ఎంటమాలజీ విభాగం సూపర్‌వైజర్ ఇంతియాజ్ పర్యవేక్షణలో దోమల మందు స్ప్రేయింగ్ చేశామన్నారు.

అభివృద్ధిని జీర్ణించుకోలేకే కేంద్రం విమర్శలు


మాట్లాడుతున్న గౌరి సతీష్ తదితరులు

అబిడ్స్: కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి చేస్తుంటే కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరిసతీష్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రధాని నరేంద్రమోదీ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పదేళ్లపాటు కేసీఆర్ ప్రభుత్వం అవినీతి అక్రమాలకు పాల్పడితే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ.. స్వచ్ఛమైన పాలన అందిస్తుందన్నారు. కక్షపూరితంగా మోదీ ప్రభుత్వం దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈడీ, సీబీఐ, ఇన్‌కమ్ ట్యాక్స్ దాడులు చేయిస్తూ.. ప్రతిపక్షాలను బెదిరిస్తుందన్నారు. ప్రజలంతా ఏకమై పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక ఎంపీ సీట్లు కట్టబెడతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

'మోదీని విమర్శించడం రాహుల్‌గాంధీకి తగదు'



అబిడ్స్: ప్రపంచంలోనే భారత్‌ను ఆర్థిక, సామాజిక రంగాల్లో నెంబర్ 1 స్థాయిలో తీర్చిదిద్దిన ప్రధాని నరేంద్రమోదీని కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ విమర్శించడం విడ్డూరంగా ఉందని గ్రేటర్ హైదరాబాద్ బీజేవైఎం సీనియర్ నాయకుడు నగర శ్రీకృష్ణ భారతీయ యాదవ సేవా సమితి అధ్యక్షుడు రాజేష్ యాదవ్ అన్నారు. ప్రస్తుతం దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న విషయం ఆయనకు కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు. బుధవారం మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా విమర్శలు చేయడం సరికాదన్నారు. దేశం మొత్తం బీజేపీకే 400 ఎంపీ స్థానాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో నిద్రలోనే వ్యక్తి మృతి

సంతోష్‌నగర్: అనారోగ్యం కారణంగా ఓ వ్యక్తి నిద్రలోనే మృతి చెందిన ఘటన కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కంచన్‌బాగ్ డీఆర్‌డీఓ టౌన్‌షిప్ ప్రాంతానికి చెందిన ఉమా, తిరుపతయ్య (42)లు దంపతులు. కాగా తిరుపతయ్య డీఎంఆర్ఎల్‌లో అటెండర్‌గా పని చేస్తున్నాడు. గత ఆరేళ్లుగా తిరుపతయ్య హెచ్ఐవీ చికిత్సలు చేయించుకుంటున్నాడు. దీనికి తోడు తిరుపతయ్యకు బీపీ, షుగర్‌తో పాటు మద్యం తాగే అలవాటు ఉంది. కాగా రోజూ మాదిరిగానే ఈనెల 5న రాత్రి 10 గంటల సమయంలో ఇంట్లోకి వెళ్లి నిద్రపోయాడు. కాగా బుధవారం ఉదయం 11 గంటల సమయంలో తిరుపతయ్యను నిద్ర లేపేందుకు ప్రయత్నించగా.. ఎలాంటి స్పందన లేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించగా.. వారు వచ్చి చూసేసరికి బెడ్‌పై మృతి చెంది ఉన్నాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

రూ.17.5 లక్షల నగదు స్వాధీనం


నగదుతో చిక్క విక్రమ్‌గౌడ్

అబిడ్స్: పోలీసుల తనిఖీల్లో భారీ ఎత్తున షాహినాయత్ గంజ్ పోలీసులు అనుమతులు లేని నగదును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం గోషామహల్ అలస్కా వద్ద ఎస్.లక్ష్మయ్య ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనంలో అన్నోజిగూడకు చెందిన చిక్క విక్రమ్‌గౌడ్ రూ.17.5 లక్షల నగదును తరలిస్తుండగా.. పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారించడంతో అతడి వద్ద ఎలాంటి అనుమతిపత్రాలు, ఇతర వివరాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ బాలు చౌహాన్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II, TRIVENI COMPLEX, 1ST FLOOR, ABIDS, HYDERABAD

O.A.NO. 965 OF 2022

Between:
INDIAN OVERSEAS BANK, Secunderabad Branch, Rep. by its Asst. General Manager ...Applicant
AND
M/s Dhameesh Gold Pvt Ltd & 5 Others ...Defendants

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

To,
Mr. NITIN KUMAR AGARWAL, 10-3-278/23, Humayun Nagar, Hyderabad-500 028. ....Defendant No.4

Please take the summons in the above O.A.No. 965 of 2022 filed by the applicant for recovery of money of Rs.5,67,98,113/- against you. The Hon'ble Tribunal has ordered summons to you by way of paper publications in "SAKSHI" daily newspaper and posted matter to 25-03-2024.

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the Defendants are directed as under:
i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
v) You shall be liable to account for the sale proceeds realised by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are hereby required to show cause on 25-03-2024 at 10:30 A.M. at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500 001 in person or by an advocate duly instructed as to why the relief prayed for should not be granted.

Take notice that in case of default the application will be heard and determined in your absence.

Given under my Hand and Seal of the Tribunal on this the 6th day of March 2024.

By Order of the Tribunal
Registrar
Debts Recovery Tribunal-2, Hyderabad.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684